స్కెచ్

# దెయ్యాలూ: దమయంతులూ

"రాహి"

కింగ్ జార్జ్ హాస్పిటల్ మెటర్నిటీ వార్డులో రాత్రి ఒంటిగంటన్నరకు గ్లూకోజు ఇంజక్షను యిస్తున్న హౌస్‌సర్జను నారాయణరావు పైవార్డు లోంచి పెద్ద పొలికేక వినిపించగా సిరంజి ట్రేలో పడేసి మేడమీదికి పరుగెత్తాడు. హెల్పు చేస్తున్న సిస్టరు డాక్టరు వెనకాలే పరుగెత్తింది. మేడమీదివార్డు 'గైనిక్'వార్డు, అక్కడ డ్యూటీ రూమ్‌లో అప్పటికే నర్సులూ, రోగులూ గుమిగూడి వున్నారు. టేబిల్ మీద ఓ సిస్టరు పడుకొనివుంది.

'ఏమిటి-ఏమయింది?". అన్నాడు నారాయణ రావు. అంతా ఒకరి మొహాలింకొకరు చూసుకో సాగారు; "చంద్రకళ పెద్దకేక వేసి unconsious గా పడిపోయింది" అన్నది స్టాఫ్‌నర్సు సుందరమ్మ. నారాయణరావు చంద్రకళ చేయిపట్టుకుని నాడి చూశాడు. వేగంగా కొట్టుకుంటోంది. "ఏదో చూచి భయపడివుంటుంది" అంటూ కూజాలోని నీళ్ళు తీసుకుని మొహంమీద చల్లాడు. మెల్లిగా చంద్రకళ కళ్లు తెరిచింది. తక్కిన నర్సులంతా ఆమె చుట్టూ చేరారు.

"ఏమిటి చంద్రా...ఎలాగుంది" అన్నది స్టాఫ్ నర్సు. చంద్రకళ లేచి కూచుని చుట్టూ చూచి, సిగ్గుతో తలవంచుకుని "ఏంలేదు స్టాఫ్. నిద్ర మత్తుగా వుంటే బల్లమీద తలపెట్టుకుని కూచున్నాను. ఉన్నట్లుండి తెల్లటి యూనిఫారంలో ఓ ఆడమనిషి వచ్చి మీదపడినట్లయింది. దాంతో భయమేసి కేకవేశాను" అన్నది.

"అయ్యో బాబోయ్ దయ్యం" అన్నది ప్రొబేషనరీ నర్సు సుకుమారం.

"నాన్సెన్స్...నో డెవిల్స్" అని భుజాలెగర వేసింది ఆంగ్లోయిండియన్ నర్సు మార్గరెట్. సుకుమారం కనుబొమలెగరేసి "నీ తలకాయ - నీకు కనిపిస్తే తెలిసేది. దయ్యాలు లేవంటావా: డాక్టర్‌ని అడుగు తెలుస్తుంది" అన్నది.

"దయ్యాలు వున్నవీ లేనివీ నాకు తెలీదు గాని, దయ్యాలతో నాకు అనుభవం ఒకటి చెబుతాను వింటారా?" అన్నాడు నారాయణరావు.

"షూర్ ... షూర్" అన్నది మార్గరెట్. అంతా నారాయణరావు చుట్టూ చేరారు.

నారాయణరావు స్టెత్ బల్లమీద పెట్టి మోకాళ్ళని టేబిల్‌కు ఆనించి చెప్పసాగాడు.

"ఫైనల్ ఇయర్ చదువుతున్న దినాల్లో నాకు మెటర్నిటీలో యింటర్న్‌మెంటు డ్యూటీ పడింది. ఒక నెలంతా మెటర్నిటీలోనే వుండాలి. ఆ రోజుల్లో నేను మెడికల్ కాలేజీ వెనక చెంగలావు పేటలో వుండేవాణ్ణి. అక్కణ్ణుంచి హాస్పిటల్‌కు రావాలంటే కాలేజీమీదుగా రావాలి. ఓనాడు సెకండ్ షో సినిమా చూచి, అక్కణ్ణుంచి రూమ్‌కు వెళ్ళి బట్టలు మార్చుకుని హాస్పిటల్‌కు బయలుదేరాను. అప్పుడు రాత్రి రెండుగంట లయింది. కాలేజీ మెయిన్‌గేటు మూసేశారు. కాని నైట్ వాచర్ యింటిదగ్గరే మరో చిన్నిగేటులాంటి దుంటే దాంట్లోంచి బయలుదేరాను. అమవాస్య అవటంవల్ల అంతా భయంకరమైన చీకటిగా వుంది. బయలుదేరానన్న మాటేగాని ఎనాటమీ థియేటర్ దగ్గరికి వచ్చేటప్పటికి భయంవేయసాగింది. ఇంతకు మునుపు చాలామందికి అక్కడ దయ్యాలు కనబడ్డాయని చెప్పుకునేవారు. స్వతహా నేను ధైర్యవంతుణ్ణి. కాని ఆ శవాల శాలమీదుగా వెళ్ళటమంటే గుండె కొట్టుకోసాగింది. ఐనా ధైర్యం తెచ్చుకుని గబగబా అడుగులు వేసుకుంటూ నడవసాగాను. ఉన్నట్లుండి మలుపులో రాళ్లు కదులుతున్న చప్పుడు వినిపించింది. అప్పటికి కాలేజీనుంచి అమ్మాయిల హాస్టల్‌కు వెళ్ళే రోడ్డు వేయలేదు. అన్నీ చిన్నచిన్న వంకరరాళ్లు వుండేవి. సరిగా అది ఎవరో కంకరరాళ్ళమీద జోళ్ళతో నడుస్తున్న చప్పుడు. ఎనాటమీ థియేటర్ దాటి వచ్చాక ఆ చప్పుడుకు కారణం అర్థమయింది.

థియేటర్ పక్కనున్న గోడదగ్గిర రాళ్ళగుట్టకు ఆనుకుని ఓ వ్యక్తి నిలబడి వుంది అని ఆగాడు నారాయణరావు.

"ఓ-మై గాడ్" అన్నది మార్గరెట్. సుకుమారం మొహంలో రక్తపుచుక్క లేదు. రెప్ప వేయకుండా వింటోంది. స్టాఫ్‌నర్స్ సంగతి యింక చెప్పక్క్లేను, మనసంతా లగ్నంచేసి వింటోంది.

నారాయణరావు చెప్పసాగాడు "తెల్లటి చీర కట్టుకునివుంది కనక ఆడమనిషి అని నిర్ధారణ చేసుకున్నాను. ఐనా సందేహం నివృత్తికాలేదు. ఆడదయ్యాలు మగాళ్లు వంటరిగా కనిపిస్తే బలత్కరిస్తాయని ఎక్కడో చదివాను. ఆవిషయం జ్ఞప్తికి వచ్చేటప్పటికి గుండె ఆగిపోయినంత పనయింది. ఐనా ఏంచేయను. దయ్యాల కాళ్ళు వంకరగా వెనక్కితిరిగి వుంటాయని ఎవరో చెప్పగావిన్నాను. చూస్తే యింకేముంది. కాళ్ళు కనబట్టంలేదు, చీరె అంచులు కప్పేయడంవల్ల - ఎలాగా ఆనాటితో మనకూ, యీ ప్రపంచానికీ రుణం తీరిపోయిందనుకున్నాను. సరే - ఏమయితే అవుతుందని ఆమెను దాటిపోదామని గబగబ నడక సాగించాను. నన్ను గుర్తుపట్టినట్లు ఆ దయ్యం రెండడుగులు ముందుకు వేసి 'మిస్టర్ నారాయణరావు - మిస్టర్ నారాయణరావు' అని వెంబడించసాగింది. నాకు గుండె ఆగిపోయినంత పనయింది. ఎలాగా వెంబడించి ప్రాణం తీస్తుందేమోయని మొండిధైర్యంవచ్చింది. వెంటనే వంగి పెద్దరాయి ఎత్తాను దగ్గరికి రానిచ్చి మీద పడేద్దామని-నేను రాయిఎత్తటం చూసి యిక వెనక్కి పరుగు లంకించుకుంటుంది అనుకున్నా. కాని లెక్కచేసినట్లు లేదు. దగ్గరకు వచ్చినా చేతిలో రాయి చూచినట్లుంది: కెవ్వన కేకవేసి 'ఇదేమిటి మిస్టర్ నారాయణరావు. నేను దయ్యాన్ని కాదు....వసుంధరని' అన్నది" అని నారాయణరావు ఆగి సిగరెట్టు తీసి వెలిగించాడు.

సుకుమారం టేబిల్ మీద ఆనుకుని నారాయణరావుమీద వాలిపోయినంత పనిచేసింది: "ఎవరా వసుంధర?" అన్నది.

మార్గరెట్ కళ్లు చిట్లించి "వెరీ మిస్టీరియస్" అన్నది. నారాయణరావు పొగ వదుల్తూ "నాన్సెన్స్-ముందు వినండి. వసుంధరంటే మెడికల్ స్టూడెంటు. మా జూనియర్" అన్నాడు.

"ఓ మైగాడ్" అన్నది మార్గరెట్ గుండె బాదుకుని. సుకుమారం ముసిముసి నవ్వులు నవ్వుతోంది. స్టాఫ్‌నర్సు బ్లాంక్ ఫేసు పెట్టి "అసలు విషయం విడమర్చి చెబితేనేగాని అర్థంకాదు డాక్టర్!" అన్నది.

నారాయణరావు ఉపక్రమించాడు "వసుంధరంటే బ్రతికివున్న స్టూడెంటే. అప్పుడు నాక్లోజ్ ఫ్రెండూ, క్లాసుమేటూ అయిన కాంతారావుతో రొమాన్సులో పడింది. వాళ్ళ హాస్టల్లో బోలెడన్ని రిస్ట్రిక్షన్సు- అనాడు సెకండ్ షో అయింతరువాత కాంతారావు అక్కడికివచ్చి కలుసుకుంటానన్నాట్ట. కాని టైముకు రాకపోవడంవల్ల నన్ను చూచి వాడి సంగతి కనుక్కుందామని పిలిచింది. అదీకథ!" అన్నాడు నారాయరావు.

సుకుమారం మార్గరెట్‌లు ఒకరి మొహాలింకొకరు చూసుకుని నవ్వకోసాగారు. స్టాఫ్‌నర్సు గంభీరంగా కూచుని ఆలోచిస్తోంది. చంద్రకళ లేచి "ఐనా నేను చూచింది నిజమైన దయ్యమే డాక్టర్!" అంది.

సుకుమారం ఫక్కున నవ్వి 'నీ తలకాయ! యిప్పుడు డాక్టర్‌గారి అనుభవం విన్నతరువాత యింకా దయ్యాలంటావేమిటి?' అన్నది. మార్గరెట్ భుజాలెగరేస్తూ ఐనానీకు మగదయ్యాలు కనబడాలేగాని, నీతో ఆడ దయ్యాలకేంపనే' అన్నది. యింగ్లీషులో-'ఛా! ఏమిటామాటలు' అన్నట్లు చూచి స్టాఫ్‌నర్సు చంద్రకళకేసి తిరిగి "చంద్రా! నువ్వు క్రిందికి వెళ్ళి కాస్సేపు రెస్టుతీసుకో. దయ్యాల్లేవు: ఏమీలేవు. అంతా భ్రమ" అన్నది. చంద్రకళ జుట్టు సర్దుకుంటూ క్రిందికి వెళ్ళి పోయింది. ఆమె వెళ్ళిన దిక్కుకు చూస్తూ "డాక్టర్! మీకు దయ్యాలంటే నిజంగా నమ్మకంలేదా?" అన్నది స్టాఫ్‌నర్సు సీరియస్‌గా.మళ్లా ఏదోకొత్తవిషయం రాబోతుందని మార్గరెట్,సుకుమారం ముందుకుజరిగారు. నారాయణరావు చిరునవ్వ నవ్వి "యిందాకటి నా అనుభవం విన్నారుగా. అంతమట్టుకే నాకు దయ్యాలమీద నమ్మకం" అన్నాడు.

స్టాఫ్‌నర్సు మెల్లిగా "కాని డాక్టర్ దయ్యాలంటే నాకు నమ్మకముంది: అందుకు రుజువు చంద్రకళ అనుభవమే" అన్నది.

(తరువాయి 42-వ పేజీలో)